సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం : 8 : జులై : 2024

● జన హితుడు



ఆ స్వరం తెలుగువారికి చిరపరిచితం...ఆ గొంతు ధ్వనిస్తే చిత్తశుద్ధి ప్రతిధ్వనించేది.. సమస్యలను తెలుసుకుని స్పందించే ఆ ఉపన్యాసగళం అజరామరం. ఆయన చల్లని చూపు వేలాది జీవితాలకు మేలిమలుపు..కోట్లాది అగ్రవర్ణ పేదల తలరాత మార్చారు. ఎందరో ఉన్నత చదువులు చదివి స్థితిమంతులుగా మారారు. అన్నివర్గాలకు ఏదో ఒక ప్రయోజనం కల్పించిన ఘనత ఆయనకు సొంతమైంది. జిల్లాలో ఏ గడపను అడిగినా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ, అభివృద్ధి ప్రస్థానం వివరిస్తుంది. నేడు వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం. - 8లో

పోటెత్తిన అభిమాన గణం





పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజల వినతులు పరిశీలిస్తూ..



మార్గమధ్యంలో అభిమానులకు అభివాదం..

అభిమాన నేతను చూసి..



సెల్ఫీ దిగుతూ..



ఈల వేసి జైకొట్టి..



నీ మేలు మరువలేమయ్యా..



అన్నా.. మేమంతా నీవెంటే..



పులివెందులలోని క్యాంపు కార్యాలయం ఆవరణలో భారీగా తరలి వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- పులివెందుల కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలతో మమేకం
- ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ
- చిన్నారి చార్వీ మృతదేహానికి నివాళి
- మాజీ ఎంపీపీ పెద్ద సుబ్బారెడ్డి కుటుంబానికి పరామర్శ



వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో కేరింతలు కొడుతున్న బాలలు, మహిళలు

సాక్షి ప్రతినిధి, కడప/పులివెందుల : పులివెందులలోని భాకరాపురంలో ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు, నేతలతో ఆదివారం మాజీ సీఎం వైఎస్ జగన్ బిజీగా గడిపారు. కొందరు సమస్యలను విన్నవించేందుకు వస్తే, మరికొందరు సుదీర్ఘకాలం తర్వాత తమ అభిమాన నేతను కలుసుకోబోతున్నామనే ఆనందంతో భారీగా తరలివచ్చారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారి సమస్యలు ఓపిగ్గా ఆలకించి పరిష్కారానికి స్పందించారు. అంకాలమ్మగూడూరు సర్పంచ్ రమణారెడ్డి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవాల్సి ఉందని మాజీ సీఎం దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన వెంటనే తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచించారు. చక్రాయపేట మండలం గొంది గ్రామానికి చెందిన మబ్బు రామయ్య తన పట్టా భూమిలో దౌర్జన్యంగా టీడీపీ వర్గీయులు రోడ్డు వేస్తున్న వైనాన్ని, దాడి చేస్తున్న దుర్మార్గాన్ని ఫొటోలతో చూపించారు. బాధితునికి అండగా నిలవాల్సిన పోలీసులు తప్పుడు కేసుకు మొగ్గు చూపుతున్నారని తెలుసుకొని తక్షణమే స్థానిక పోలీసు అధికారులను పిలిపించి మాట్లాడారు. బాధితునికి న్యాయం చేయకపోగా, అన్యాయం చేయడం తగదని తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇలా ఎవరికి వారు ఇబ్బందులు చెప్పుకుంటుంటే ఓపిగ్గా వింటూ అవసరమైన చర్యలకు సిఫార్సులు చేశారు. మరోవైపు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవాలని, ఆయనకు అండగా నిలవాలని, మేమంతా మీవెంటే ఉన్నామని చెప్పాలనే ఆత్రుత పెద్ద ఎత్తున పులివెందుల ప్రజానీకంలో కనిపించింది. యువత మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూడగానే కేరింతలు కొట్టారు. ఫొటోలు, సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

చిన్నారి చార్వీకి నివాళులు...

పులివెందుల మున్సిపల్ కౌన్సిలర్ రాజేశ్వరి చెల్లెలి కుమార్తె చిన్నారి చార్వీ(6) పాము కాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజారెడ్డి కాలనీలో వారి ఇంటికి వెళ్లి చార్వీ మృతదేహానికి నివాళులు అర్పించారు. చిన్నవయస్సులో పాము కాటుకు గురై మృతి చెందడంతో తల్లడిల్లుతున్న తల్లిదండ్రులను ఓదార్చారు. చార్వీ మృతి పట్ల మాజీ సీఎం వైఎస్ జగన్ చలించిపోయారు. కుటుంబానికి అండగా నిలవాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల గుండెపోటుతో లింగాల మాజీ ఎంపీపీ పెద్దసుబ్బారెడ్డి సతీమణి లక్ష్మీనరసమ్మ మృతి చెందారు. పెద్దకుడాలలోని వారి ఇంటికి మాజీ సీఎం వైఎస్ జగన్ వెళ్లి పెద్ద సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లింగాల మండలంలోని వివిధ గ్రామాల నాయకులను పేరుపేరునా పలకరించారు.

తండోపతండాలుగా జనసందోహం...



లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో వైఎస్ జగన్ కోసం వేచి ఉన్న మహిళలు

పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. జిల్లావ్యాప్తంగానే కాకుండా అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తండోపతండాలుగా తరలి వచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులతో మాజీ సీఎం వైఎస్ జగన్ చర్చించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, కడప మేయర్ సురేష్‌బాబుతోపాటు, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డిలతోపాటు వివిధ జిల్లాలకు చెందిన నాయకులు కలిశారు. ఆయా విషయాలపై చర్చించారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా స్థానిక పరిస్థితులను వివరించారు. రాజకీయ అంశాలతో పాటు, వ్యక్తిగత యోగక్షేమాలు తెలుసుకున్నారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని వైఎస్ జగన్ ప్రజాప్రతినిధులను ఆదేశించారు.



లింగాల మండలం పెద్దకుడాలలో వైఎస్ జగన్‌ను చూసేందుకు రోడ్లపై బారులు తీరిన మహిళలు



వైఎస్ జగన్‌తో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, మూలె సుధీర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



లింగాల మండలం పెద్దకుడాల సమీపంలో వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలి వచ్చిన అభిమానులు

న్యూస్‌రీల్

తైవాన్ ఇంటర్న్‌షిప్‌కు మిట్స్ విద్యార్థులు



తైవాన్ వెళ్లిన మిట్స్ విద్యార్థులు

కురబలకోట : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో కొత్త నైపుణ్యాలు, టెక్నిక్స్ నేర్చుకునేందుకు అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులు తైవాన్‌లోని ఆసియా యూనివర్సిటీ ఇంటర్న్‌షిప్‌కు వెళ్లినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్న్‌షిప్‌కు వెళ్లడంపై కరస్పాండెంట్ ఎస్.విజయభాస్కర్ చౌదరి విద్యార్థులను అభినందించారు.

సౌమ్యనాథుడి సన్నిధిలో అన్నమయ్య జిల్లా ఎస్పీ



నందలూరు : ఉమ్మడి కడప జిల్లాలో చారిత్రాత్మక దేవాలయమైన నందలూరులోని శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయాన్ని ఆదివారం అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి వివరించారు. ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. రాజంపేట డీఎస్పీ చైతన్య, రాజంపేట టౌన్ సిఐ మద్దయ్య ఆచారి, రాజంపేట రూరల్ సిఐ మంజునాథ రెడ్డి, నందలూరు ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, ఏఎస్‌ఐ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా సంక్షేమ, అభివృద్ధి

పథకాల అమలుకు కృషి

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చామకూరి శ్రీధర్



రాయచోటి : ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి అందరి సహకారంతో అన్నమయ్య జిల్లా అభివృద్ధికి పాటుపడతానని అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌కు చేరుకున్న నూతన జిల్లా కలెక్టర్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ చాంబర్‌లో వేద పండితుల ఆశీర్వచనాల అనంతరం ఉదయం 11.32 గంటలకు చామకూరి శ్రీధర్ అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెంది బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న తనను రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా నియమించిందన్నారు. కలెక్టర్‌గా తనకు ఇది మొదటి పోస్టింగ్ అన్నారు. అన్నమయ్య జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు చెందిన జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ, ఆర్డీఓలు, జిల్లా అధికారుల బృందం, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి జిల్లా అభివృద్ధికి పాటుపడతామని పేర్కొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణరావులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లాలోని ఆర్డీఓలు, పలువురు జిల్లా అధికారులు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు, పాత్రికేయులు, ప్రముఖులు తదితరులు పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలతో జిల్లా కలెక్టర్‌కు స్వాగతం పలికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం

అన్నమయ్య జిల్లా అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దామని జిల్లా అధికారులతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో తన ఛాంబర్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలపై దృష్టిసారించి వాటిని విజయవంతం అయ్యేలా అధికారులు పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణరావు, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామిని దర్శించుకున్న కలెక్టర్

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చామకూరి శ్రీధర్ రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ అధికారులు ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీ వినాయకుడు, అఘోరలింగేశ్వరుడు, శ్రీ వీరభద్రస్వామి, శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టతను, స్థలపురాణాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి,



శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

క్లుప్తంగా

లోకాయుక్తను కలిసిన అధికారులు



రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డిని కలిసిన సిబ్బంది

పెద్దతిప్పసముద్రం : రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి వారం రోజుల విడిది కోసం మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లికి విచ్చేశారు. గత నెల 30వ తేదీన ఇక్కడకు వచ్చిన ఆయన ఆదివారం రోడ్డు మార్గంలో పోలీస్ ఎస్కార్ట్‌తో కర్నూలుకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి, తంబళ్లపల్లి కోర్టు, రెవెన్యూ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి కాసేపు ముచ్చటించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి అస్వస్థత



తీవ్రంగా గాయపడిన సురేష్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూచిపల్లికి చెందిన చాకల మల్లికార్జున కుమారుడు సురేష్(25) విద్యుత్ షాక్‌తో అస్వస్థతకు గురయ్యాడు. స్థానికుల వివరాల మేరకు.. తన మిద్దెపైకి వెళ్లిన సురేష్‌కు ప్రమాదవశాత్తూ అక్కడ ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు యువకుడిని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు.

మైనర్ బాలిక అదృశ్యం

మదనపల్లె : మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీ బాషు తెలిపారు. పట్టణంలోని గాంధీపురానికి చెందిన ఓ మైనర్ బాలిక(17) ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి ఎంతోసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కలా గాలించారు. ఆచూకీ లభించక పోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరారైన ఖైదీ పట్టివేత



ఖైదీ మస్తాన్‌ను చూపిస్తున్న డీఎస్పీ చైతన్య

రాజంపేట : ఈ నెల 4న రాజంపేట సబ్ జైలు నుంచి పరారైన ఖైదీ షేక్ మస్తాన్‌ను పట్టుకున్నట్లు రాజంపేట డీఎస్పీ చైతన్య తెలిపారు. స్థానిక అర్బన్ పీఎస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. అర్బన్ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్లు గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ఈ నెల 7న చెన్నై–ముంబయి రైలులో వెళ్తున్న మస్తాన్‌ను రాజంపేట రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేశామన్నారు. ముద్దాయిది రైల్వేకోడూరు మండలం రంగనాయకులపేట గ్రామమని వెల్లడించారు.

జన హితుడు



ఒక్కరు.. ఇద్దరు కాదు, లక్షలాది మంది ప్రాణాలు నిలిచాయి. కోట్లాది అగ్రవర్ణ పేదల తలరాత మార్చారు. ఎందరో ఉన్నత చదువులు చదివి స్థితిమంతులుగా మారారు. ఫ్యాక్షన్ ఊబిలో చిక్కిన కుటుంబాల దశను మార్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు ఇప్పటికీ ఎప్పటికీ మరువలేనివి. తరాలుగా దారిద్ర్యంతో కొట్టుమిట్టాడుతున్న పేదల విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం చేయూతగా నిలిచింది. అనారోగ్యం పాలైతే వల్లకాడే దిక్కుగా ఉన్న పేదలకు ఆరోగ్యశ్రీ పథకం పునర్జన్మ కల్పించింది. ఇళ్లులేని నిరుపేదలందరికీ గూడు కల్పించి వైఎస్.రాజశేఖరరెడ్డి వారి పాలిట కల్ప వృక్షంలా మారారు. అణగారిన వర్గాల ఉన్నతికి రిజర్వేషన్లు కల్పించి చరిత్ర తిరగరాశారు. అరుగాలం శ్రమించినా ఫలితం దక్కని రైతన్నకు వెన్ను దన్నుగా నిలుస్తూ పెద్దన్న పాత్ర పోషించారు. వృద్ధులు, పెద్ద కొడుకు, వితంతువులకు సోదరుడుగా.. ఇలా చెప్పుకుంటూపోతే ఐదేళ్ల పాలనలో అన్నివర్గాలకు ఏదో ఒక ప్రయోజనం కల్పించిన ఘనత ఆయనకు సొంతమైంది. ఓ వైపు పన్ను లేకుండా మరోవైపు సంక్షేమ పాలన చేపట్టి, ప్రభుత్వ పాలనంటే ఇలా ఉండాలని చూపి భవిష్యత్ తరాలకు డాక్టర్ వైఎస్సార్ ఆదర్శప్రాయుడుగా నిలిచారు.

– సాక్షి ప్రతినిధి, కడప

- మరుపురాని మనిషి దివంగత ముఖ్యమంత్రి వైఎస్
- పేదల ప్రత్యక్ష దైవం వైఎస్‌ఆర్ 75వ జయంతి నేడు
- ఇడుపులపాయలో నివాళులర్పించనున్న కుటుంబసభ్యులు
- ఊరు వాడల్లో విస్తృత సేవా కార్యక్రమాలు

మానవత్వం మూర్తీభవించిన నాయకుడు

డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి మానవత్వం మూర్తీభవించిన నాయకుడు. అనంతపురం నుంచి అదిలాబాద్ వరకూ, శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాకా ఆ పేరు ఉచ్చరిస్తేనే మనస్సు పులకిస్తుంది. అందుకు కారణం రాజకీయాలకు అతీతంగా పేదలను ప్రేమించడం, వర్గాలకు, పార్టీలకు, ప్రాంతాలకతీతంగా సమగ్రాభివృద్ధి చేయాలనే తపన ఉండడం. ప్రజల కోసం, ఎంతటి కష్టాన్నైనా భరించి సంక్షేమ పాలన చేపట్టడం. పన్నులు వేయకుండా ఐదేళ్ల పాలనలో ఆదర్శంగా నిలవడం.. ఇలా ఎన్నో సంస్కరణలతో ప్రజానీకం గుండె లోతుల్లో మరుపురాని జ్ఞాపకంగా కొలువయ్యారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇడుపులపాయలో వైఎస్సార్ జయంతి వేడుకల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోపాటు వైఎస్ కుటుంబ సభ్యులు ఇడుపులపాయలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొననున్నారు.

ఆయన చొరవతో మాట వచ్చింది



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలుడి పేరు గాజులపల్లె హేమంత్ నరసింహారెడ్డి. బద్వేలు మండలం బయనపల్లె గ్రామం. నరసింహారెడ్డి, నాగేశ్వరమ్మ దంపతుల సంతానమైన హేమంత్ నరసింహారెడ్డికి చెవుడు, మూగ ఉన్నట్లు గుర్తించేసరికే తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. ఆపరేషన్ చేస్తే బాలుడికి వినికిడి వస్తుందని చెప్పడంతో ఆర్థిక భారం భరించలేక దిక్కుతోచని పరిస్థితుల్లో తల్లి తల్లడిల్లిపోయింది. అప్పటి సీఎం దివంగత వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ఆ కుటుంబాన్ని ఆదుకుంది. హైదరాబాద్‌లో రూ.6 లక్షల విలువైన ఆపరేషన్ చేసి కాక్లియర్ ఇన్‌ప్లాంటేషన్ మిషన్ అందజేశారు. దీంతో బాలుడు మాట్లాడటంతోపాటు వినికిడి లోపం పోయింది. ప్రస్తుతం ఆ బాలుడు పదో తరగతి పూర్తిచేసి ఇంటర్ చదివేందుకు సమాయత్తం అవుతున్నాడు. తన కుమారుడికి మాట వచ్చేలా సహకరించిన వైఎస్సార్‌ను జీవితాంతం గుర్తుంచుకుంటామని హేమంత్ తల్లి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఓ రోల్ మోడల్

విశ్వసనీయతే ప్రామాణికంగా రాజకీయాలు నెరిపిన ఆయన, మాట ఇస్తే ఎంత కష్టమైనా నెరవేర్చాలని తపించేవారని విశ్లేషకులు కొనియాడుతుంటారు. ముఖ్యమంత్రిగా వైఎస్.రాజశేఖరరెడ్డి పనిచేసిన తర్వాత, అంతకుముందు ఇలాంటి సంక్షేమ పాలన ఎందుకు చేపట్టలేకపోయారనే ప్రజలు అవలోకనంలో పడ్డారు. మెడిసిన్ పూర్తి కాగానే జమ్మలమడుగు క్యాంబెల్ ఆసుపత్రిలో వైద్యుడిగా పేదలకు సేవలందించిన వైఎస్ ఆ తర్వాత పులివెందులలో తన తండ్రి వైఎస్.రాజారెడ్డి పేరిట 30 పడకల ఆసుపత్రి నిర్మించి పేదలకు వైద్య సేవలందించసాగారు. అనతి కాలంలోనే పేదల డాక్టర్‌గా, ఒక్క రూపాయి వైద్యుడిగా గుర్తింపు పొందారు. తండ్రి కోరిక మేరకు 1978లో తొలిసారిగా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున వైఎస్.రాజశేఖరరెడ్డి పోటీ చేసి గెలుపొందారు. ఆనాటి నుంచి 2009 వరకు ప్రతిసారీ ఎన్నికల్లో విజయం సాధించి ఓటమెరుగని ధీరుడిగా ఘనతకెక్కారు. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా, మరో రెండు పర్యాయాలు పీసీసీ అధ్యక్షుడిగా, మూడు పర్యాయాలు సీఎల్పీ నేతగా, నాలుగు పర్యాయాలు పార్లమెంటు సభ్యుడిగా, ఆరు సార్లు ఎమ్మెల్యేగా దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి పదవులు చేపట్టారు. ఏ పదవి చేపట్టినా అందులో రాజకీయ నేతలకు రోల్ మోడల్‌గా కన్పించేవారని విశ్లేషకులు వివరిస్తున్నారు.

జిల్లాపై ప్రత్యేక ముద్ర

నిర్లక్ష్యపు నీడలో మగ్గుతున్న కడప జిల్లాపై డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రత్యేక ముద్ర వేశారు. 2004లో ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధిని నలుమూలలా పరుగు పెట్టించారు. 2004–09 వైఎస్ యుగంలో సమగ్రాభివృద్ధి దిశగా పయనింపజేశారు. జిల్లాలో యోగి వేమన యూనివర్సిటీ, జెఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, పశు వైద్య కళాశాలను నెలకొల్పారు. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల, 750 పడకల రిమ్స్ ఆసుపత్రి, దంత వైద్యశాల, అలాగే ట్రిపుల్ ఐటీ, ఐ.జి కార్ల్ పశు పరిశోధన కేంద్రం, దాల్మియా, భారతి సిమెంటు కర్మాగారాలు, గోవిందరాజా స్పిన్నింగ్ మిల్స్, బ్రాహ్మణీ స్టీల్స్ పరిశ్రమలు తీసుకువచ్చారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను డాక్టర్ వైఎస్సార్ హయాంలో శరవేగంగా చేపట్టారు. ఎన్నికల సమయంలో మాత్రమే శంకుస్థాపనలు చేసే తెలుగుదేశం పార్టీ నాయకులకు కనువిప్పు కలిగించారు. సుమారు రూ.12 వేల కోట్లతో జలయజ్ఞంలో భాగంగా సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేశారు. గాలేరు నగరి సుజల స్రవంతి, గండికోట కెనాల్, టన్నెల్, గండికోట వరదకాల్వ, గండికోట ఎత్తిపోతల పథకాలను వైఎస్‌ఆర్ హయాంలో రూపొందించినవే. మైలవరం ఆధునికీకరణ, సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టు, సి.బి.ఆర్, పి.బి.సీ, వెలిగల్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పనులు చకచకా సాగించారు. జిల్లాలో వేగంగా వృద్ధి సాధించడంతో అప్పటి వరకు ఉన్న ఫ్యాక్షన్ సైతం కనుమరుగైందని విశ్లేషకులు వివరిస్తున్నారు. నాయకుడంటే డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వలె ఉండాలని, ప్రజలపై మానవత చూపాలని, అందుకే యావత్తు భారతదేశానికి ఆదర్శప్రాయుడుగా నిలిచారని పలువురు ఇప్పటికీ కొనియాడుతుండడం విశేషం.

వైఎస్సార్ ప్రాణం పోశారు..



ఈ ఫోటోలో వ్యక్తి పేరు పెనుకొండ రామశేషయ్య. ప్రొద్దుటూరులోని శ్రీనివాస నగర్‌లో నివాసముంటున్నాడు. ఆయన వయసు 76ఏళ్లు. రామశేషయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. ఈ క్రమంలో 2009 ఏప్రిల్, 15న ఉన్నట్టుండి రామ శేషయ్య కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా గుండెపోటు వచ్చినట్లు చెప్పారు. నాడు బైపాస్ సర్జరీ అన్నా.. గుండెకు స్టంట్ వేయడమన్నా పేద, మధ్య తరగతి వర్గాలకు ఖర్చుతో కూడుకున్న పని. నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం గురించి తెలుసుకున్న రామశేషయ్య కుటుంబ సభ్యులు వెంటనే తిరుపతి స్విమ్స్‌కి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు రామశేషయ్యకు గుండెకు స్టంట్ వేశారు. తర్వాత ఇంటికి వచ్చిన నాగేషయ్య డ్రైవర్ వృత్తి చేసుకుని జీవనం సాగించాడు. రామశేషయ్య సంతోషంగా గడుపుతున్న సమయంలో రెండోసారి 2019లో మళ్లీ గుండె పోటు వచ్చింది. కుటుంబసభ్యులు తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆరోగ్యశ్రీకి అధిక ప్రాధాన్యం ఇచ్చి ఎంతోమంది పేద, మధ్య తరగతి వర్గాల ప్రాణాలను కాపాడింది. నాగశేషయ్య గుండెకు మళ్లీ స్టంట్ వేశారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఆయన కుమారుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తమ కుటుంబంలో వెలుగులు నింపారని నాగశేషయ్య సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వారు లేకుంటే తాను జీవించేవాడిని కాదని రామశేషయ్య తెలిపారు.

కాశినాయనతో విడదీయలేని బంధం



దివంగత ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డితో కాశినాయన మండలానికి విడదీయలేని అనుబంధం ఉంది. ఎందుకంటే కొత్తగా శ్రీఅవధూత కాశినాయన మండలం ఏర్పడింది. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత కాశినాయన మండలంపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించి తీర్చిదిద్దారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందించారు. ఇదే మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామానికి చెందిన రెబ్బానరసయ్య కుమారుడు నరసింహకు ఏడాది వయస్సులోనే గుండె ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్ చేయడంతో నరసింహ ప్రాణాలు దక్కాయి. రాజశేఖర్‌రెడ్డికి రుణపడి ఉన్నామని బాలుడి కుటుంబీకులు చెబుతున్నారు. వైద్య చికిత్స చేసినప్పటి నుంచి నేటికీ నరసింహ ఆరోగ్యంగా ఉన్నాడు.

ఆరోగ్యశ్రీ లేకుంటే బతికేవాడిని కాదేమో



దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశ పెట్టక పోయింటే నేను ఇంత కాలం బతికి ఉండేవాడిని కాదేమో అనిపించిందని వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం కె.రాజుపల్లెకు చెందిన కుప్పం శ్రీనివాసరావు అన్నారు. ఈయన వయసు 78 సంవత్సరాలు. 2006లో తన ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో కడప పుట్టపర్తి ఆస్పత్రిలో చికిత్సకు వెళ్లారు. అక్కడి వైద్యులు గుండెకు జబ్బు వచ్చింది స్టంట్ వేయాలని చెప్పారు. అప్పట్లో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో స్టంట్ వేయించుకోవడం ఆర్థిక భారంగా మారింది. దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశ పెట్టాడు. దీంతో వెంటనే హైదరాబాద్ జిల్లా నాంపల్లిలోని కేర్ హాస్పిటల్‌కు వెళ్లి స్టంట్ వేయించుకున్నారు. అప్పట్లో ఉమ్మడి కడప జిల్లాలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన మొట్టమొదటి వ్యక్తి ఇతడే. ఇప్పటి వరకు ఇతడి గుండెకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. ఆ మహానుభావుడు వైఎస్.రాజశేఖరరెడ్డి దయతోనే నేను ఇంతకాలం బతికానని శ్రీనివాసరావు చెబుతున్నారు.

కార్యకర్తలకు ఎల్లవేళలా తోడుంటా

వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : నియోజకవర్గంలోని ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా తోడుంటానని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గాలివీడు మండలం బోరెడ్డిగారిపల్లెకు చెందిన ఎంపీటీసీ చంద్రప్రకాష్‌రెడ్డి మాతృమూర్తి రంగులమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆమె మృతి పట్ల సంతాపం తెలిపి, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక ప్రజల సమస్యలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దేరంగుల నారాయణ, ఉమాపతిరెడ్డి, నాయకులు మహాదేవరెడ్డి, మన్సూర్, వెంకట నారాయణరెడ్డి, కలందర్, వీరాంజులు, మహబుల్లా, యాకుబ్‌వలి, లాల్‌బాషా, అమీర్‌బాషా, నారాయణ, బషీర్, నాగభూషన్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాల ఆవిష్కరణ



పంచ గ్రంథాలను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

మదనపల్లె : మదనపల్లె ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ కోడూరు ప్రభాకరరెడ్డి రచించిన ఐదు గ్రంథాల ఆవిష్కరణ స్థానిక జ్ఞానోదయ హైస్కూల్‌లో ఆదివారం జరిగింది. గ్రంథ పంచక ఆవిష్కరణ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని సాహితీ ప్రియులు, బాషాభిమానులు పాల్గొన్నారు. డాక్టర్.గొల్లపూడి తిరుపతిరావు మాట్లాడుతూ..ఉమ్మడి చిత్తూరు జిల్లా, సమీప ప్రాంతాల్లో ఒక రచయిత రచించిన ఐదు గ్రంథాలను ఒకే రోజు, ఒకే వేదికపై ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి రచించిన మీరా భజనలు, కర్పూరవసంతరాయలు, సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణచార్యుల జీవితం, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి కవిత్వం, వజ్జలగ్గమ్ గ్రంథాలను ఆవిష్కరించి వక్తలు సమీక్షించారు. ఆపై గ్రంథ కర్తలు, గ్రంథావిష్కర్తలు, ముఖ్య అతిథులను ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సురభిహేమలత, ఆకుల మల్లేశ్వరరావు, జొన్నవిత్తుల రామచంద్రమూర్తి డాక్టర్.డేరంగుల శ్రీనివాసులు, ప్రొఫెసర్ జ్ఞానీ చంద్రశేఖరశర్మ, టీఎస్ఏ.కృష్ణమూర్తి, డాక్టర్ అలుగుంటి సిద్దారెడ్డి, కామకోటి ప్రసాదరావు, యస్.సుమతిరెడ్డి, వై.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్.బయ్యారెడ్డి, డాక్టర్.సంగమ్మ, జి.రామమోహన్‌రెడ్డి, నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం భర్త ఇంటి ఎదుట నిరసన

బద్వేలు అర్బన్ : తనకు న్యాయం చేయాలని ఓ మహిళ భర్త ఇంటి ఎదుట నిరసనకు దిగిన ఘటన బద్వేల్ పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని కోట వీధికి చెందిన కళ్యాణ్‌కు పట్టణంలోని అబ్బరాతి వీధికి చెందిన లక్ష్మీ ప్రసన్నతో 17 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. రెండేళ్లపాటు సజావుగా సాగిన వీరి కాపురంలో మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. కడపలో తన ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్న లక్ష్మీ ప్రసన్న ఆదివారం కోటవీధిలోని భర్త ఇంటి ఎదుట నిరసనకు దిగింది. 14 ఏళ్లుగా తనను, తన పిల్లలను పట్టించుకోకుండా వదిలేశాడని, తనకు న్యాయం చేయాలని ఆరోపించారు. విడాకులు ఇవ్వాలని తనపై ఒత్తిడి తెస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

సమాజ హితమే ఎంఆర్‌పీఎస్ ఉద్యమ గమ్యం

ఎంఎస్‌పీ జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగ



ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

మదనపల్లె : సమానత్వం, సమాజ హితమే ఎంఆర్‌పీఎస్ ఉద్యమ గమ్యమని ఎంఎస్‌పీ జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగ పేర్కొన్నారు. మండలంలోని కుమారపురం, రామారావు కాలనీ, బసినికొండ, గాంధీపురం, మిట్టమర్రి, మరో 20 గ్రామాల్లో ఎంఆర్‌పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరించి, కేక్ కోసి వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నరేంద్రబాబు, రవి మాదిగ, ఆరేటివాసు మాట్లాడుతూ 29 ఏళ్లుగా సామాజిక మానవతా ఉద్యమాలతో తెలుగు నేలను పునీతం చేసిన చరిత్ర ఎమ్మార్పీఎస్‌కే ఉందన్నారు. ఏ కుల, సామాజిక సంఘాలకు లేని గుర్తింపు ఎంఆర్‌పీఎస్, మందకృష్ణ మాదిగకు ఉందన్నారు. త్వరలోనే ఎస్సీ వర్గీకరణ సాధిస్తామనే విశ్వాసం తమకుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు వై.రాజా, రాయపేట రమణ, బండ్రేవు రమణ, శ్రీరాములు, మోపూరి మనోహర్, అంజప్ప, తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి



దాడికి గురై తీవ్రంగా గాయపడిన దుర్గ

మదనపల్లె : భార్యపై వివాహం చేసుకున్న భర్తే కత్తితో దాడిచేసి గాయపరిచిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు... స్థానిక చౌడేశ్వరీ నగర్ మొదటి క్రాస్‌లో నివసిస్తున్న ఎస్.ఆర్.దుర్గ(28)తో కే.భాస్కర్‌నాయుడుకు వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న భాస్కర్ మద్యానికి అలవాటుపడ్డారు. నిత్యం మద్యం తాగి భార్యపై అనుమానం వ్యక్తం చేస్తూ వేధింపులకు గురిచేస్తుండేవాడు. మూడు నెలల కిందట భర్త వేధింపులపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో దుర్గ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అప్పటి నుంచి పిల్లలను చూసేందుకు భాస్కర్ వచ్చేవాడు. ఆదివారం మద్యం తాగి వచ్చిన అతడు దుర్గతో గొడవకు దిగాడు. ఇల్లు ఖాళీ చేయలేదెందుకంటూ అసభ్య పదజాలంతో దూషిస్తూ వెంట తెచ్చుకున్న కత్తితో భార్యపై దాడి చేశాడు. తలపై తీవ్ర గాయం కావడంతో స్థానికులు ఆమెను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ ఏఎస్‌ఐ వెంకటరమణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కువైట్ నుంచి స్వగ్రామానికి పెంచలయ్య మృతదేహం

అట్లూరు : మండలంలోని కొత్తకోటపాడుకు చెందిన గంపా పెంచలయ్య మృతదేహం కువైట్ నుంచి స్వగ్రామానికి ఆదివారం చేరింది. ఈ నెల 4వ తేదీన పెంచలయ్య కువైట్‌లో బిల్డింగ్ పనులు చేస్తూ గుండెపోటుకు గురై మృతిచెందారు. మృతుడి బంధువులు శనివారం రాత్రి పెంచలయ్య మృతదేహాన్ని కువైట్ నుంచి కొత్తకోటపాడు గ్రామానికి తీసుకువచ్చారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి బంధువులతోపాటు గ్రామ ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

15న జంప్ రోప్ జిల్లా స్థాయి జట్టు ఎంపిక

మైదుకూరు : మైదుకూరులోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఈ నెల 15న జంప్ రోప్ జిల్లా స్థాయి జట్టు ఎంపిక చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా జంప్ రోప్ స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం రెండు గంటలకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేస్తారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈ నెల 27, 28వ తేదీల్లో నంద్యాల జిల్లాలో జరిగే 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జంప్ రోప్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులకు రిజిస్ట్రేషన్, ఈవెంట్ ఫారాలు ఇస్తామని, ఆధార్ కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్, ఫొటోలు జతపరిచి అందజేయాలని సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ లోకేష్

మదనపల్లె : ద్విచక్ర వాహనంలో వెళుతూ ఆగిన లారీని ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కదిరి పట్టణంలోని వెలుగు కార్యాలయం సమీపంలో నివసిస్తున్న జేసీబీ డ్రైవర్ లోకేష్(20), కారు డ్రైవర్ శివ(20) ఇద్దరూ స్నేహితులు. లోకేష్‌కు మదనపల్లెలో డబ్బులు రావాల్సి ఉండటంతో కదిరి నుంచి స్నేహితుడైన శివతో కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి కదిరికి వెళ్తూ మార్గమధ్యంలో ములకలచెరువు మండలం బురకాయలకోట వద్ద ఆగిఉన్న లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో లోకేష్ తీవ్రంగా గాయపడగా, శివకు గాయాలయ్యాయి. బాధితులిద్దరినీ 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



విద్యుత్తు షాక్‌కు గురై గాయపడిన సురేష్

విద్యుత్ షాక్‌తో యువకుడికి..

మదనపల్లె : విద్యుత్తు షాక్‌తో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పీటీఎం మండలంలో జరిగింది. బూచిపల్లెకు చెందిన మల్లికార్జున కుమారుడు బి.సురేష్(24) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం సురేష్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ...మిద్దెపైకి వెళ్లాడు. మాట్లాడే క్రమంలో ఇంటిపై వెళుతున్న 11కేవీ విద్యుత్తు తీగలను గమనించకుండా తాకాడు. తీవ్ర గాయాలై నొప్పితో విలవిల్లాడుతూ కేకలు పెట్టిన సురేష్‌ను కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. అవుట్ పోస్ట్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువులు తనిఖీ చేస్తున్న ఏడీఏ సాలురెడ్డి

గుర్రంకొండ : గుర్రంకొండలోని పలు ఎరువుల దకాణాల్లో కర్నూలు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ అధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గోదాముల్లో పురుగుల మందులు, ఎరువుల నిల్వలు తనిఖీ చేసి స్టాకు రిజిష్టర్లు పరిశీలించారు. స్థానిక పుడమి కిసాన్ మార్ట్‌లో రూ.1.92 లక్షల విలువచేసే 1.59 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు ఆ ఎరువులు విక్రయించవద్దని డీలర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, తిరుపతి విజిలెన్స్ అండ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామకృష్ణ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి వెంకట మోహన్, ఏవో నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బి.కొత్తకోట : బి.కొత్తకోటలోని ఎరువుల దుకాణాలపై కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, తదితరులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. బెంగళూరు రోడ్డులోని ఎంవీఆర్ ట్రేడర్స్‌లో రికార్డులు, బిల్లులు చూపకపోవడంతో దుకాణం లైసెన్సు రద్దుకు సిఫారసు చేయడమేగాక, ఎరువు విక్రయాలను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బాలాజీ ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు నిర్వహించి 16.9 టన్నుల ఎరువుల నిల్వలు, బిల్లులకు తేడా ఉండడంతో విత్తన విక్రయ లైసెన్సు రద్దుకు సిఫారసు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో అధికారులు ఎం.రామకృష్ణ నాయక్, వెంకట మోహన్, ఏఓ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.